

రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కొలగాని వీవీఎస్ మూర్తి, రత్నశ్రీ దంపతులు (కాకినాడ) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్

పిఠాపురం: రేపటి నుంచి ఈ నెల 17 వరకూ పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 1,18,431 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి డెల్టా కాలువలకు 12,950 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,250, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

మాజీ ఎంపీ అనురాధ

అల్లవరం: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే ఓటమిని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక అంతులేని అరాచకాలు చేస్తోందని అనురాధ ఆరోపించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భారీగా దొంగ ఓట్లకు పాల్పడినా వైఎస్సార్ సీపీ గెలుస్తుందని అనురాధ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని ఆమె అన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో అడ్మిషన్లకు సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లు కేటాయించాల్సి ఉందన్నారు. అర్హులైన తల్లి తండ్రులు వారి చిన్నా రుల అడ్మిషన్ల నిమిత్తం సచివాలయాలు, మీ సేవా ఇంటర్నెట్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొనే అవకాశముంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఈనెల 25న ఎంపికైన విద్యార్థుల వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈ నెల 31నుంచి ఎంపికైన విద్యార్థులకు ప్రవేశాలు ఉంటాయి. హెల్ప్ లైన్ కోసం 1800-4258599 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సంప్రదించవచ్చునన్నారు. రాష్ట్ర ఎస్సీడీ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందని, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, అనాథలు, వీధి పిల్లలకు ప్రాధాన్యమిస్తామన్నారు.

యూఏఈలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కోనసీమ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూఏఈలో ఉద్యోగాలకు యువత నుంచి ఓవర్సీస్ ప్లేస్‌మెంట్‌కు అవకాశం కల్పిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ఏపీ ఆల్ యాసఫ్ ఎంటర్‌ప్రైజస్ కలిసి యూఏఈలో ఉద్యోగ నియామక కార్యక్రమాన్ని ప్రకటించాయి. 25 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు ఉండి, విద్యా అర్హత కలిగిన పురుష అభ్యర్థులు ఆయా జాబ్ రోల్స్‌లో ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. ఎంపిక చేసిన అభ్యర్థులకు యూఏఈ లో రెండు సంవత్సరాల ఉద్యోగ ఒప్పందం కల్పిస్తారు. భోజనం, రవాణా, వైద్య సదుపాయాలు వసతి వంటి సౌకర్యాలను నియామకదారులు అందిస్తారు. వివరాల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 91-9988853335, 9704414258లో సంప్రదించాలని తెలిపారు.

దోపిడీకి పర్మిట్



- కోనసీమ జిల్లాలో విచ్చలవిడిగా పర్మిట్ రూములు
- మొత్తం 144 మద్యం షాపుల్లో 90 చోట్ల అనధికార ఏర్పాట్లు
- మినీ బార్లను మించి సౌకర్యాలు
- అక్కడ తాగేవారికి వాటర్ పేరిట రూ.10 అదనపు బాదుడు
- కిల్లీషాప్‌లు... ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు అనుమతి ఇవ్వనున్న ప్రభుత్వం
- సొమ్ము చేసుకుంటున్న మద్యం షాపుల యాజమాన్యాలు
- ఆదాయం పెంచుకునేందుకు అంటూ అడ్డదారులు



రాయవరంలో ఒక మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్



అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్

సాక్షి, అమలాపురం: తాగు... తాగించు.. ఆదాయం పెంచు అనే కూటమి ప్రభుత్వ మద్యం విధానం మరిన్ని కొత్త పుంతలు తొక్కుతోంది. మద్యం దుకాణాల వద్ద అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లతో మద్యం ప్రియుల నుంచి దుకాణదారులు దోచుకుంటున్నారు. ఇప్పుడు ఆ పర్మిట్ రూమ్‌లకు అధికార ముద్ర వేసి ప్రభుత్వం దోపిడీకి సిద్ధమవుతోంది. అదనపు ఆదాయం పేరుతో పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇవ్వడం అనేది చంద్రబాబు మార్కు సంపద సృష్టి అని సామాన్యులు మండిపడుతున్నారు.

జిల్లాలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో మద్యం దుకాణదారులు చెలరేగిపోతున్నారు. దుకాణాలకు అనుబంధంగా బెల్టుషాపులు, పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి తీర ప్రాంత మత్స్యకార గ్రామం వరకు అటు మద్యం షాపుల యజమానులు.. ఇటు ప్రభుత్వ పెద్దలు మద్యం ప్రియుల జేబులు చిల్లులు పెట్టడం పైనే దృష్టి సారిస్తున్నారు. దుకాణదారులకు బెల్టు షాపుల మీద వస్తున్న ఆదాయం కన్నా పర్మిట్ రూమ్‌ల ఆదాయం అధికంగా ఉంది. జిల్లాలో 144 మద్యం షాపులు ఉండగా, ప్రతి ఐదు దుకాణాలకు మూడు దుకాణాలకు పర్మిట్ రూమ్‌లున్నాయని అంచనా. జిల్లా వ్యాప్తంగా 90కి పైగా మద్యం దుకాణాల వద్ద అనుమతులు లేకుండా పర్మిట్ రూమ్‌లు ఉన్నాయని అంచనా. మద్యం షాపులకు అనుగుణంగా పర్మిట్ రూమ్‌లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం బార్ అండ్ రెస్టారెంట్లకు అనుమతుల పునరుద్ధరణ ప్రక్రియ జరుగుతోంది. ఇది నెలాఖరుకు పూర్తి చేయడంపై ఎక్సైజ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే మద్యం షాపులకు అనుగుణంగా పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అధికారికంగా మార్గదర్శకాలు వెలువడనున్నాయి. జిల్లాలో మద్యం షాపులు ప్రారంభమైన సమయం నుంచే గుట్టుచప్పుడు కాకుండా పర్మిట్ రూమ్‌ల వద్ద తాగిస్తున్న మద్యం షాపుల యజమానులు, ప్రభుత్వం అనుమతులు ఇస్తుందన్న సమాచారం అందడంతో ఉత్తర్వులు అందక ముందే బరితెగించేస్తున్నారు. విచ్చలవిడిగా పర్మిట్ రూమ్‌లు తెరిచేసి తాగించేస్తున్నారు. గ్లాసులు, షోడాలు, వెజ్, నాన్‌వెజ్ స్నాక్స్ ఏర్పాటు చేసి మరీ విక్రయాలు చేపడుతున్నారు. అర్ధరాత్రి వరకూ రూములు తెరిచే ఉంచుతున్నారు. దీంతో ఆ ప్రాంతం తాగుబోతులతో రద్దీగా మారుతోంది. అక్కడే తాగి.. అక్కడే తూలుతున్నారు. అటుగా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, సామాన్య గ్రామాలు ఇలా ఎక్కడైనా మద్యం దుకాణం ఉంటే చాలు వాటి పక్కనే పర్మిట్ రూమ్‌లు కూడా ఉన్నాయి. చివరకు బ్యాంకులు, పాఠశాలల సమీపంలో కూడా ఇవి ఉండడం విశేషం.

బార్లను తలపిస్తున్నాయి

మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లు బార్లను తలపిస్తున్నాయి. వీటి వద్ద సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సువిశాల ప్రాంగణాల్లో గదులు ఏర్పాటు చేశారు. మందుబాబుల కోసం కుర్చీలు, టేబుళ్లు అందుబాటులో ఉంచారు. వర్షం, ఎండ పడకుండా విశాలమైన షెడ్లు వేసి.. బయటకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పర్మిట్ రూమ్‌ల అమ్మకాలు మద్యం దుకాణదారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇక్కడ కూర్చుని తాగే వారి నుంచి క్వార్టర్‌కు అదనంగా రూ.పది చొప్పున వసూలు చేస్తున్నారు. వీటితోపాటు ఇక్కడ ఏర్పాటు చేసే కిల్లీ బడ్డీలకు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు నెలవారీ అద్దె మీద దుకాణాలు ఇస్తూ కాసులు దండుకుంటున్నారు.

జిల్లా కేంద్రంలో లెక్కలేని తనం

జిల్లా కేంద్రమైన అమలాపురంలో మద్యం అమ్మకాలు పట్టపగ్గాల్లేకుండా సాగుతున్నాయి. స్థానిక కీలక నాయకుడి ఆధ్వర్యంలో అధికార పార్టీ సిండికేటు నడుస్తుండడం, చినబాబు ముఖ్య అనుచరుడి ఆధ్వర్యంలో మరో సిండికేటు ఉండడంతో అడ్డుకునేవారు లేకుండా పోయారు. మున్సిపల్ సర్క్యులర్ బజార్, చిన్న వంతెన, 216 బైపాస్‌కు సమీపంలో కామనగరువు రోడ్డు వద్ద, ఎర్రవంతెన - నల్లవంతెనల మధ్య ఉన్న మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లున్నాయి. అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో ఎస్‌బీఐ బ్యాంకు, ఆ బ్యాంకు ఏటీఎంల మధ్యలో ఉన్న మద్యం దుకాణం వద్ద కూడా పర్మిట్ రూమ్‌లు ఉండడం గమనార్హం. రామచంద్రపురం, మండపేట పట్టణాలలో కూడా ఇదే పరిస్థితి. రావులపాలెం, కొత్తపేట, పి.గన్నవరం, మలికిపురం వంటి ప్రాంతాల్లో తొలుత రెస్టారెంట్‌లు ఏర్పాటు చేయడం, తరువాత వాటిని పర్మిట్ రూమ్‌లుగా మార్చడం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీస్, మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అనధికార పర్మిట్ రూమ్‌లను ప్రభుత్వం అధికార ముద్ర వేయనుండడంతో అనుమతుల కోసం కట్టే ఫీజులను సైతం మద్యం ప్రియుల నుంచే దోచేందుకు దుకాణాల యజమానులు సిద్ధమవుతున్నారు.

క్రాస్ వెరిఫికేషన్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఆధార్ మిస్ మ్యాచింగ్ క్రాస్ వెరిఫికేషన్ వంటి ఐదు రకాల అంశాల తనిఖీపై రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బంది చొరవ తీసుకుని మొదటి విడత నిధులు మంజూరుకు కృషిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, కార్యదర్శి ఎస్.ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీపై జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విచారణ అధికారుల నుంచి పెండింగ్‌లో ఉన్న సాధారణ విచారణ నివేదికలను తెప్పించుకుని గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టీ. నిషాంతీ, డీఆర్‌ఓ కే. మాధవి, ఆర్డీవోలు పీ. శ్రీకర్, డి. అఖిల, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, సర్వే ఏడి కే ప్రభాకర్ పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్య సాధన

జిల్లాస్థాయి అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లు మండల సర్వేయర్లతో సమావేశం నిర్వహించి తల్లికి వందనం పెండింగ్ అంశాలు, షెడ్యూల్ కులాల వారికి బరియల్ గ్రౌండ్ కోసం స్థల సేకరణ, మండలాల వారీగా పట్టాదారు పాస్ పుస్తకాల వీఆర్వోల ద్వారా తనిఖీపై సమీక్షించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై గ్రామ సెక్రటరీలకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న అముడా వైస్ చైర్‌పర్సన్, జేసీ నిషాంతి

అమలాపురం టౌన్: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) ఆధ్వర్యంలో అమలవుతున్న లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)పై జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు అవగాహన పెంచుకోవాలని అముడా వైస్ చైర్‌పర్సన్, జేసీ టి.నిషాంతి సూచించారు. అమలాపురంలోని వాసర్ల గార్డెన్స్‌లో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు అధ్యక్షతన జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలతో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో చాలా అనధికార లే అవుట్లు ఉన్నాయని, ఇందుకు పంచాయతీ సెక్రటరీలు విధుల సక్రమంగా నిర్వర్తించకపోవడమే కారణమన్నారు. ఇక నుంచి పంచాయతీ సెక్రటరీలు ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్లానింగ్ ఆఫీసర్ ఎ.సత్యమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి మాట్లాడారు. అముడా పరిధిలోకి వచ్చే 180 మంది పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

పుర వీధుల్లో మువ్వెన్నెల!



అమలాపురంలో 400 అడుగుల జాతీయ జెండాతో సాగుతున్న ర్యాలీ



అమలాపురం గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, పలు సంస్థల ప్రతినిధులు

- 400 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ
- చైతన్యవంతంగా హర్ ఘర్ తిరంగా

అమలాపురం టౌన్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అమలాపురం వీధుల్లో 400 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు చేతపట్టి ఊరేగారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అయ్యల భాస్కరరావు ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో పార్టీ నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. తొలుత వీరు సర్ సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో సమావేశమయ్యారు. అక్కడ నుంచి కలశం సెంటర్‌కు ప్రదర్శనగా వెళ్లారు. స్థానిక శుభ కలశం నుంచి 400 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన, ఊరేగింపు మొదలై గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటర్ వరకూ సాగి తిరిగి సర్ సీవీ రామన్ స్కూలు ప్రాంగణానికి చేరింది. గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాల ప్రదర్శన జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, హర్ ఘర్ తిరంగా ప్రోగ్రామ్ జోనల్ ఇన్‌చార్జి నల్లా పవన్‌కుమార్ ప్రసంగించారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సూదా గణపతి, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చాంబర్ కార్యదర్శి కొమ్మూరి ప్రసాద్, సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, బీజేపీ నాయకులు చిట్టూరి రాజేశ్వరి, డీవీఎస్ రాజు, కొండేటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

యువ సమాజాన్ని కాపాడుకుందాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర

అమలాపురం టౌన్: బాధ్యతాయుతమైన యువ సమాజాన్ని కాపాడుకుందామని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం. దుర్గారావు దొర పిలుపునిచ్చారు. డ్రగ్స్‌తో పాటు ఎయిడ్స్, హెచ్ఐవీ వంటి లైంగిక వ్యాధులు దరి చేరకుండా యువతలో అవగాహన పెంచి వాటిని సమూలంగా నిర్మూలిద్దామన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య రుగ్మతలు, అనివార్యమయ్యే పోలీస్ కేసులు, శిక్షల తీవ్రతను ఆయన వివరించారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జూన్ 12 నుంచి ఈ నెల 12 వరకూ 8 వారాలపాటు జిల్లాలో విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి మొదలైన అవగాహన ర్యాలీ నల్ల వంతెన వరకూ నినాదాలతో సాగింది. ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పసుపులేటి సౌమ్య, డాక్టర్ సాయిరామ్, ఏఆర్‌టీ డేటా ఆపరేటర్ డాక్టర్ సుమిత్ర, డీసీఆర్‌సీ కౌన్సిలర్ కవిత, జన కళ్యాణ్ స్వచ్ఛంధ సంస్థ మేనేజర్ జి.శ్రీను, విహాన్, ఎల్‌డబ్ల్యూల సిబ్బంది, వివిధ విద్యాలయాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

కొన ఊపిరికి కొత్త ఊపిరి

- ధన్య చరితులు.. పుణ్యమూర్తులు
- వారి త్యాగం చైతన్యానికి ప్రతీక
- కన్ను మూస్తూ.. మరొకరికి జన్మనిస్తున్న దాతలు
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

కపిలేశ్వరపురం: ఆలోచన అయినా ఆచరణ అయినా బొందిలో ప్రాణం ఉన్నంత వరకే. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు తీసుకొన్న సామాజిక అవగాహనతో కూడిన నిర్ణయాలు మరణించిన వ్యక్తిని మరెన్నో తరాలు జీవించేలా చేస్తాయి. అలాంటి కోవలోకి వచ్చే అవయవదానం సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతోమంది తమ అవయవాలను దానం చేసి ఎంతోమందికి ప్రాణం పోశారు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

పెరిగిన అవసరం

భారతదేశంలో అవయవాలు సకాలంలో అందుబాటులో లేక రోజుకు 20 మంది చొప్పున చనిపోతున్నారని అంచనా ఉంది. ప్రతి పది నిమిషాలకు ఒకరు అవయవ మార్పిడి చేయించుకోవాల్సిన పరిస్థితి దేశంలో ఉంది. అవయవాలు అవసరమైన వారిలో పది శాతం మందికి కూడా అవి లభ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అవయవదానం ప్రాధాన్యం పెరిగింది. సాహితీవేత్తలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరణానంతరం తమ దేహాలను దానం చేస్తూ అంగీకార పత్రాలను రాసిన చరిత్ర ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకి ఉంది.

బ్రెయిన్ డెత్ కావడంతో...

మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన యువకుడు నున్న శివన్నారాయణ (శివ) ఈ ఏడాది మే 25న రాజమహేంద్రవరం-ద్వారపూడి రహదారిలో ప్రమాదానికి గురికావడంతో బ్రెయిన్ డెత్ అయ్యింది. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో అతని అవయవాలను దానం చేయడం ద్వారా ముగ్గురికి జీవితాన్ని ప్రసాదించాడు. లివరు, ఒక కిడ్నీని ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి, మరో కిడ్నీని విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అమర్చారు. రెండు నేత్రాలలోని కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

చేయడం ఇలా..

దాతలు జీవిస్తూనే వారి అవయవాలలో కొంత భాగాన్ని దానం చేస్తూ ఇతరులకు ఊపిరి పోస్తున్నారు. రక్తాన్ని, 50 శాతం కాలేయాన్ని, రెండింటిలో ఒక కిడ్నీని ఇతరులకు దానం చేయడం ఈ కోవలోనివే. మరొక పద్ధతిలో వారు చనిపోయిన తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయంతో అవయవాలు దానం చేస్తున్నారు. బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తుల్లో మొత్తం రెండు కిడ్నీలను, గుండెను, కాలేయాన్ని, ఊపిరితిత్తులను, ప్యాంక్రియాసిస్ గ్రంధిని వాటి పనితీరు సామర్థ్యాన్ని బట్టి ఇతరులకు దానం చేస్తున్నారు. తన దేహాన్ని మరణానంతరం వైద్య కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం కళాశాలకు అప్పగించాలంటూ కొందరు ముందస్తు ఒప్పంద పత్రాన్ని రాస్తున్నారు. సహజ మరణం పొందిన వారి నుంచి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్తనాళాలు దానం చేసే వీలు ఉంది.



ఈ ఏడాది మే 28న బ్రెయిన్ డెత్‌తో అవయవ దానం చేసిన శివన్నారాయణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మండపేట నియోజకవర్గ నాయకులు (ఫైల్)

చిరంజీవులయ్యారు

మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కాకర శ్రీనివాసరావు ఈ ఏడాది జూలై 12న గుండెపోటుతో మృతిచెందగా



ఆయన నేత్రాలను అనపర్తి రాధాకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూళిపూడి సీతారాం అనే మహిళ ఈ ఏడాది జులై 1న గుండె పోటుతో మరణించగా నేత్రదానం చేశారు. తాళ్లరేవు మండలం వూడా హిమావతి ఈ ఏడాది జనవరి 26న గుండెపోటుతో మరణించడంతో రెండు నేత్రాలను కాకినాడ బాదం ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ద్రాక్షారామ పద్మ స్టూడియో అధినేత కె.వీర్రాజు ఈ ఏడాది మే 28న మృతి చెందగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పలపకూర వెంకట్రావు ఏడాది ఏప్రిల్ 26న గుండె పోటుతో మరణించగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కె.గంగవరం గ్రామానికి చెందిన చింత చిన్నారి ఈ ఏడాది ఫిబ్రవరి 27న మృతి చెందగా రెండు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు.

వైద్య విద్యార్థుల పరిశోధన లక్ష్యంగా..

కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఆలయ శిల్పి పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి (91) 2021 డిసెంబర్ 8న వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన జీవించి ఉండగానే 2009 నవంబర్ 22న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహదాన ఒప్పంద పత్రాన్ని రాసి ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆ మేరకు సూర్య నారాయణమూర్తి దేహాన్ని కళాశాలకు అప్పగించారు. పిఠాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, వజ్రాయుధం పుస్తక రచయిత ఆవంత్స సోమసుందర్ 2016 ఆగస్టు 12న వృద్ధాప్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. పిఠాపురం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) తానూ, తన భార్య అనూరాధ ఇద్దరూ తమ దేహాలను వైద్య కళాశాలకు రాసి ఇచ్చారు. కాగా 2022 ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే రోజున సత్యనారాయణశాస్త్రి గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులు రాజానగరం జీఎస్ఎల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. ఆ స్ఫూర్తితో అదేరోజు సత్యనారాయణ శాస్త్రి కుమారుడు గౌరవ్, కోడలు కల్యాణిలు తమ దేహాలను దానం చేసేందుకు ఒప్పంద పత్రాలను రాసి ఇచ్చారు.

నాన్న స్ఫూర్తితో దేహదానం చేశాం



నాన్న మానవ సమాజం పట్ల అవగాహనతో జీవించారు. నా చిన్ననాటి నుంచీ అనేక విషయాలు బోధించారు. ఆయనతో పాటు అమ్మకు అవగాహన కల్పించి ఆమె దేహాన్ని కూడా దానం చేసేందుకు చైతన్య పర్చారు. ఆ స్ఫూర్తితో నేను, నా జీవిత భాగస్వామి కల్యాణి కూడా దేహదానం చేసేందుకు పత్రం రాశాం.

– మేకా గౌరవ్, పిఠాపురం, కాకినాడ జిల్లా